


భార్య ముఖంలోకి సూటిగా, తీక్షణంగా చూశాడు శివరావు.

శివరావు భార్య కామాక్షికి తను పదవ తరగతిలో చదువుకున్న న్యూటన్ మూడవ చలనసూత్రము గబుక్కున జ్ఞాపకమొచ్చి భర్తవంక సరిగ్గా అంతే సూటిగా, అంతే తీక్షణంగా చూచింది.

శివరావుకు ఒళ్ళు మండిపోయింది.

ఆ రాత్రే సాయంకాలం ఆఫీసునుండి యింటికి వస్తూ వస్తూ దారిలో ఏదో

మహిళామహాసభకు హాజరై వచ్చాడతను. మహిళాసభలోని ప్రముఖ మహిళామణుల ఉపన్యాసాలు విన్నాక అతనికి జీవితంలో ఎన్నడూ రానంత కోపమొచ్చింది, వాళ్ళకు కావలసినవేవో వాటిని ఏకరువుపెట్టి ఏడ్వక వీళ్ళు మగవాళ్ళను దూషించడమెందుకూ అని అతనెంతగానో ఉడుక్కున్నాడు. క్షణికంగా అతనికి స్త్రీ జాతిమీద ప్రత్యక్షంగా, భార్యమీద పరోక్షంగా ఏవగింపు కలిగింది...ఆ ఆవేశంలోనే గబగబా యింటికొచ్చాడు, ముఖంనిండా గంభీరాన్ని పులుముకుని.

యింటి ప్రక్కా విడతో కలిసి మ్యాట్నీ సినిమా చూచి...సినిమాలో ఎన్నోసార్లు అలిగే హీరోయిన్నూ, హీరో అనేక రకాల లంచాలిచ్చి బ్రతిమిలాడి, లాలించి, బుజ్జగించి ప్రసన్నురాలిని చేసుకున్న సన్నివేశాలనూ గేదె చొప్పను నెమరేసుకున్నట్టు పదేపదే నెమరువేసుకుంటూ యింటిదాకా వచ్చి - అప్పటిదాకా ఆఫీసునుండి రాని భర్తనూ...తన పట్ల అతని నిర్లక్ష్యాన్నీ తలచుకుని... తనను తానే తిట్టుకుని సినిమాలో కథానాయకిలా పోజుపెట్టి అలిగి గోడకానుకుని కూర్చుంది కామాక్షి.

ఓ అరగంట తర్వాత—

రోజూ మల్లెపూల పొట్లంతో వచ్చే శివరావు వట్టిచేతులనే వ్రేలాడేసుకుంటూ వస్తూంటే చూచి - ఆమె మనసు పెనం మీది పేలపు గింజలా చిట్లిపోయింది.

"ఏమిటలా బెల్లంకొట్టిన రాయిలా కూర్చున్నావ్. నీకూ్కడా ఏవైనా హక్కులున్నాయా - చదివేయ్" అన్నాడు శివరావు అసహనంగా. అతని తలలో మహిళాసభ దృశ్యాలు కదులుతున్నాయి చకచకా

"ఆఁ ఆఁ... యిక హక్కులే కావాలి మాకు. అవే తక్కువైనాయ్ బ్రతుక్కి. నన్నో కుక్కను చూస్తున్నట్లు చూస్తున్నది పోయి—"

"ఏమిటీ - నిన్ను కుక్కను చూస్తున్నట్లు చూస్తున్నానా. ఏం తక్కువైంది. నీకిప్పుడు,.ఐనా...యింకేం ఉద్యమించు ఊరేగు...పో"

"ఊరేగాలా ... నేను... ఎందుకు గాడిదలా చాకిరి చేస్తున్నది చాలక ఊరేగాలా...ఐనా నా ఖర్మ...అదృష్టముండాలి దేనికైనా—" సినిమాలోని సీన్ ఆమె మనసును పిసికేస్తోంది. అతను తన దగ్గరికొచ్చి తనను బ్రతిమిలాడుతే ఎంత బాగుండును అనుకుంది.

"అదృష్టమా...యిప్పుడు నీకేం తక్కువైందే బ్రూట్. అసలు అడిగినవన్నీ యిచ్చి నేనే నిన్ను నెత్తికెక్కించుకున్నాను—ఛీఛీ".

"ఉఁఉఁ... అడిగినవన్నీ యిచ్చాడు పాపం మొనగాడు. ఒక్కసారైనా లాలనగా దగ్గరికి తీసుకుని..."




"ఛీ నోర్ముయ్" చివాలున లేచి మంచమెక్కి ఒరిగాడు కోపంతో.

కామాక్షి యీ కలలాడిపోయిన కోరికను ముడుచుకుపోయిన మనసులో దాచుకుని భారంగా కళ్ళు మూసుకుంది.

దీనికి జెంపరెక్కనై అలుసై పోయింది—

ప్రతిదానికీ సర్దుకుపోతూంటే తను చులకనైపోతోంది ఈయనకు—

అతనిలో బెట్టు—ఆమెలో పంతం.

యిద్దరూ అలిగారు. బ్రతిమిలాడే వాళ్ళు లేరు.

అతనికి కునుకు పట్టేసింది.

వీధి తలుపేయకుండానే కామాక్షి కన్ను వాల్చింది.

అర్ధరాత్రి ఎప్పుడో చటుక్కున మెలకువవచ్చి ఆమె లేచి వంటింట్లో ఏదో ఎలుక కదలిన చప్పుడవుతే—

వంటింట్లోని స్టీల్ గిన్నెలూ, సామాన్లూ అన్నీ ఖాళీ ... 'ఎవరో దొంగ—"

"ఏమండీ...ఏమండీ—" కంగారుగా లేపింది భర్తను.

తర్వాత – కామాక్షి ఎన్నడూ అలగలేదు కావాలని.

శివరావు ఎన్నడూ చీటికి మాటికి చిర్రు, బుర్రు, లాడలేదు.